

రైతుబంధుకు నిరీక్షణ!

రైతుబంధు నిధుల కోసం అన్నదాతలకు నిరీక్షణ తప్పడం లేదు. చేతిలో డబ్బులు లేక అప్పు చేసి పంటలు పండిస్తున్నారు. 8లో▸



ఓటే ఆయుధం

ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల వాతావరణం నెలకొంది. అచ్చం సార్వత్రిక ఎన్నికల మాదిరి ఏర్పాట్లు చేశారు. 8లో▸



చెరువు కబ్జాపై ఫిర్యాదు

శంకర్‌పల్లి మండలం మిర్జాగూడలో పెద్ద చెరువు కబ్జాపై అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

ధరణిలో అన్ని సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి పోర్టల్‌తో తలెత్తిన భూ సంబంధిత సమస్యలన్నీ పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ తెలిపారు. ప్రభుత్వ వైఖరి సాంకేతిక సమస్యలకే పరిమితం కాకుండా మూలాల నుంచి పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం లేకపోవడంతో నేరుగా ఎంఆర్‌ఓ, కలెక్టర్ల చేతుల్లోకి అధికారం కేంద్రీకరించబడటం సమస్యలు పెరగడానికి ప్రధాన కారణమైందని తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులే కాకుండా భూ సమస్యలపై కొత్త దరఖాస్తులను స్వీకరించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూ ప్రక్షాళన పేరుతో ధరణి సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చి.. పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను పెద్దలకు కట్టబెట్టిందని, వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. 1940లో భూ సర్వే జరిగిందని, ఆ తర్వాత ఇప్పటి వరకు సర్వే చేపట్టలేదన్నారు. అక్రమార్కులు రికార్డులను తారుమారు చేసి భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని, వెంటనే సమగ్ర భూ సర్వే చేపట్టి, ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు.

ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు



ఉద్యోగ నియామక పత్రం అందుకుంటున్న సయ్యద్ అర్షా

కందుకూరు: నెల వ్యవధిలో ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఓ మహిళ ఆదర్శంగా నిలిచింది. మండల పరిధిలోని నేదునూరుకు చెందిన సయ్యద్ అర్షా ఇటీవల గురుకుల బోర్డు ప్రకటించిన ఫలితాల్లో డిగ్రీ లెక్చరర్ గణితం ఉద్యోగంతో పాటు జూనియర్ లెక్చరర్ గణితం, పీజీటీ గణితం, టీజీటీ గణితం ఉద్యోగాలు సాధించింది. ఆమె భర్త ఎండీ సల్మాన్ ప్రస్తుతం మండల పరిధిలోని దాసర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అర్షా ఎంఎస్‌సీ, బీఈడీ పూర్తి చేసి మూడేళ్లుగా ఇంటి వద్దనే ఉంటూ భర్త సహకారంతో పోటీ పరీక్షలకు సిద్ధమైంది. గ్రామంలోని పిల్లలకు ట్యూషన్ చెబుతూ పరీక్షలకు సిద్ధమైనట్లు ఈ సందర్భంగా అర్షా తెలిపారు. తనకు ఉద్యోగం రావడానికి తన భర్త సహకారం, ప్రోత్సాహమే కారణమన్నారు. డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాన్ని ఎంచుకుని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నాలుగు ఉద్యోగాలు సాధించిన ఆమెను పలువురు అభినందించారు.

ఒకేసారి తీన్మార్

శంకర్‌పల్లి: ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు ఆ యువకుడు. పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు. మండలంలోని రావులపల్లి కలాన్ గ్రామానికి చెందిన కొకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల వెలువడిన గురుకుల నియామక ఫలితాల్లో జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలను సాధించాడు. మూడు ఉద్యోగాల్లో జేఎల్ (జూనియర్ లెక్చరర్) ఎంచుకున్నట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించినందుకు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పలువురు గ్రామస్తులు అభినందించారు.

‘జీరో’.. జోరు



లబ్ధిదారుకు జీరో బిల్లు అందజేస్తున్న విద్యుత్ సిబ్బంది



TSSPDCL
Gruha Jyothi
'0' Bill

Dt: 01/03/2024 Time: 08:24
Bill No: 1 MRID: 99248
ERO: SHADNAGAR(028)
Sec: KOTHUR

SC No. K023 03072
USC No. 108209490
Name: K.NARASIMHA W/O RAMU
Addr: 1-67

Cat 1A Domestic Ph: 1
Contracted Load 1.00 KW
Meter No. 03515650(IR) MF: 1.0

	Date	Sts	Reading(KWH)
Present	01/03/24	01	9527
Previous	08/02/24	01	9451

Units: 76 Days: 22
Average Month Units: 101.0
Recorded MD: 1.78

Energy Charges	258.40
Fixed Charges	17.80
Customer Charges	90.00
Electricity Duty	4.56

ఓ వినియోగదారుడికి వచ్చిన జీరో బిల్లు

పేదల ఇళ్లలో గృహజ్యోతి వెలుగులు

- విద్యుత్ బిల్లుల జారీ ప్రక్రియ ముమ్మరం
- గ్రేటర్ జిల్లాల్లో 12 లక్షల మందికి ఊరట
- 200 యూనిట్లలోపు వారికే వర్తింపు..
- ఒక్క యూనిట్ పెరిగినా మొత్తం బిల్లు చెల్లించాల్సిందే..
- నిరంతరాయంగా ఆధార్, రేషన్‌కార్డుల అనుసంధానం

సాక్షి, సిటీబ్యూరో: జీరో (సున్నా) కరెంట్ బిల్లుల అమలు ప్రక్రియ గ్రేటర్ పరిధిలో ముమ్మరంగా కొనసాగుతోంది. నెలవారీ విద్యుత్ బిల్లుల జారీలో భాగంగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ శుక్రవారం ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ‘గ్యారంటీ’ల హామీలు నెరవేర్చే ప్రక్రియలో భాగంగా 200 యూనిట్లలోపు గృహ విద్యుత్ వినియోగదారులకు మార్చి నుంచి ఉచిత విద్యుత్ పంపిణీ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఫిబ్రవరి 27న గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. జూనియర్ లైన్‌మెన్‌లు, ఆర్టిజన్ కార్మికులు శుక్రవారం ఉదయం నుంచే మీటర్ రీడింగ్ నమోదు ప్రక్రియను చేపట్టారు. 200 యూనిట్లలోపు కరెంట్ వినియోగించిన వారికి జీరో బిల్లులు జారీ చేశారు. గ్రేటర్ పరిధిలో 245 ఆపరేషన్ సెక్షన్లు ఉండగా, వీటిలో తొలి రోజు సుమారు 4.90 లక్షల కనెక్షన్లకు బిల్లులు జారీ చేశారు. తొలిసారిగా జీరో బిల్లును అందుకున్న పేదలు హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకం ద్వారా మార్చిలో సుమారు 12 లక్షల మందికి నెలవారీ బిల్లు నుంచి ఊరట లభించనుంది. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన వారికే ఈ పథకాన్ని వర్తింపజేశారు. అంతకు మించి యూనిట్లు వినియోగించిన వారికి యథావిధిగా పూర్తి బిల్లు జారీ చేయడం కొసమెరుపు. విద్యుత్ వినియోగంలో పొదుపును పాటించడం ద్వారా వచ్చే నెల నుంచి వీరంతా జీరో బిల్లు పొందే అవకాశాన్ని కూడా కల్పించింది.

నిరంతర ప్రక్రియ..

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో తొమ్మిది సర్కిళ్లు ఉండగా, వీటిలో 48,03,963 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వినియోగదారులు 30 లక్షల మందికిపైగా ఉన్నట్లు అంచనా. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా మూడు జిల్లాల నుంచి 19.85 లక్షల దరఖాస్తులు గృహజ్యోతి పథకం కింద అందాయి. వీరిలో 17.21 లక్షల మందికి మాత్రమే రేషన్ కార్డులు ఉన్నాయి. చాలా మందికి రేషన్ కార్డులు లేకపోవడంతో వారంతా తమ కనెక్షన్లను ఈ ఉచిత పథకానికి అనుసంధానం చేసుకోలేని పరిస్థితి నెలకొంది. కొన్ని ఇళ్లలో ఒకే మీటర్ ఉండటం.. రెండు, మూడు కుటుంబాలు అద్దెకు ఉండటం.. వీరందరికీ కలిపి ఉమ్మడిగా ఒకే మీటర్ ఉండటం.. నెలవారీ విద్యుత్ వినియోగం పరిమితికి మించి నమోదవుతుండటం ఇబ్బందిగా మారింది. ఆర్థికంగా వెనుకబడి ఉన్నప్పటికీ..పలు సాంకేతిక కారణాలతో వారంతా ఈ పథకానికి నోచుకోలేక పోతున్నారు. ఇప్పటి వరకు 12 లక్షలలోపు వినియోగదారులు మాత్రమే తమ రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్లను ఈ పథకానికి అనుసంధానం చేసుకున్నారు. మార్చిలో ఈ దరఖాస్తుదారులకు మాత్రమే ఈ పథకం కింద జీరో బిల్లులు జారీ చేశారు. అయితే ఈ ప్రక్రియను నిరంతరాయంగా నిర్వహించాలని ప్రభుత్వం డిస్కంకు ఆదేశాలు జారీ చేసింది. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడేవారంతా నేరుగా వినియోగదారుల సేవా కేంద్రాలు, జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాలకు చేరుకుని తమ కనెక్షన్‌కు సంబంధిత ధ్రువపత్రాలను అనుసంధానించుకోవాలని సూచించింది. అద్దె ఇళ్లలో ఉన్న వారు కూడా నిస్సందేహంగా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది.



స్కైవే నిర్మించనున్న రోడ్డు

కంటోన్మెంట్‌లో స్కైవేలకు కేంద్రం ఓకే

- వర్కింగ్ పర్మిషన్ ఇస్తూ కేంద్రం ఉత్తర్వులు
- త్వరలోనే కార్యరూపంలోకి..
- ప్యాట్నీ నుంచి హకీంపేట, ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి రూట్లో తప్పనున్న ట్రాఫిక్ ఇబ్బందులు



విలేకరులతో మాట్లాడుతున్న కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్

కంటోన్మెంట్: ఎట్టకేలకు కంటోన్మెంట్‌లో ప్రతిపాదిత స్కైవేలు కేంద్రం గ్రీన్ సిగ్నల్ తెలిపింది. స్కైవేల నిర్మాణానికి అవసరమైన రక్షణ భూముల కేటాయింపునకు ఇటీవలే అంగీకారం తెలిపిన కేంద్రం, తాజాగా స్కైవేల నిర్మాణానికి పూర్తిస్థాయి అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ బోర్డు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్ట్రాటజిక్ రోడ్స్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఎస్‌ఆర్‌డీపీ) పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ పరిధిలో స్కైవేల నిర్మాణం చేపట్టనుంది. రాజీవ్ రహదారిపై ప్యాట్నీ చౌరస్తా నుంచి హకీంపేట వరకు సుమారు 14 కిలోమీటర్లు, నాగ్‌పూర్ హైవే మార్గంలో ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వరకు సుమారు 6.5 కిలోమీటర్లు రెండు ఎలివేటెడ్ కారిడార్లుగా స్కైవేలు నిర్మించనున్నట్లు గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తొలి ప్రతిపాదనలో ప్యారడైజ్ నుంచి సుచిత్ర సర్కిల్ వరకు స్కైవే నిర్మించాలని భావించినప్పటికీ, ఈ మార్గంలో సుచిత్ర నుంచి బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వరకు ఫ్లైఓవర్ నిర్మాణం కొనసాగుతోంది. దీంతో ప్రతిపాదిత స్కైవేను బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వరకు కుదించినట్లు తెలుస్తోంది.

బీఓఓ కమిటీ ఏర్పాటు

- రక్షణ భూముల బదలాయింపునకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా కేంద్రం భాగస్వామ్య పక్షాలతో బోర్డ్ ఆఫ్ ఆఫీసర్స్ (బీఓఓ) కమిటీ ఏర్పాటు చేసింది. హెచ్‌ఎండీఏ, డిఫెన్స్ ఎస్టేట్స్ కార్యాలయం, లోకల్ మిలటరీ అథారిటీ, కంటోన్మెంట్ బోర్డుల నుంచి ఒక్కో ప్రతినిధి చొప్పున నలుగురు సభ్యులు ఈ కమిటీలో ఉంటారు.
- ప్రతిపాదిత ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం మొత్తం 150 ఎకరాల రక్షణ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించనున్నారు. ఇందులో 90 ఎకరాలు ఆర్మీకి సంబంధించిన స్థలాలు కాగా, కంటోన్మెంట్ బోర్డు స్థలాలు 30 ఎకరాలు, సివిల్ ఏవియేషన్ ఇతరత్రా మరో 30 ఎకరాలు ఉన్నాయి. ప్రైవేటు స్థలాలు వీటికి అదనం.
- ఈ మార్గాల్లో ప్రస్తుతం ఉన్న రోడ్లను 60 మీటర్లకు విస్తరించనున్నారు. ఈ మేరకు రాజీవ్ రహదారి, నాగ్‌పూర్ హైవేలో పెద్ద సంఖ్యలో ప్రైవేటు భవనాలు కనుమరుగు కానున్నాయి.
- బేగంపేట ఎయిర్‌పోర్టు, హకీంపేట ఎయిర్‌పోర్టు వంటి ప్రాంతాలకు సమీపంలో ఫ్లైఓవర్లకు బదులుగా టన్నెల్ రూపంలో రోడ్ల నిర్మాణం చేపట్టే అవకాశముంది. దీనిపై త్వరలోనే హెచ్‌ఎండీఏ పూర్తిస్థాయి స్పష్టత ఇవ్వనుంది.
- ఫ్లైఓవర్ నిర్మాణం కోసం కంటోన్మెంట్ బోర్డు 30 ఎకరాలకు పైగా స్థలాన్ని కోల్పోతున్నందున, అందుకు గాను సుమారు రూ.300 కోట్ల పరిహారం ఇవ్వాలని బోర్డు అధికారులు కోరారు. అయితే కంటోన్మెంట్, ఆర్మీ, డిఫెన్స్ ఎస్టేట్స్, ఎయిర్‌ఫోర్స్ వంటి విభాగాలన్నీ కేంద్ర ప్రభుత్వ పరిధిలోనివే కాబట్టి, పరిహారం పూర్తిగా కేంద్రానికి చెందేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో బోర్డుకు ఎలాంటి పరిహారం దక్కే అవకాశం లేకుండా పోయింది.
- తాజా భూకేటాయింపుల్లో భాగంగా కంటోన్మెంట్ బోర్డు బాలంరాయి పంప్ హౌజ్, బేగంపేట ఎయిర్‌పోర్టు, హకీంపేటలో ఎయిర్‌లైన్స్ స్థలాలు, కొన్ని ఓల్డ్ గ్రాంట్ బంగళాలు తమ స్థలాలను కోల్పోనున్నాయి. ముఖ్యంగా ఎస్‌సీసీ, ప్రతిష్టాత్మక సికింద్రాబాద్ క్లబ్ భారీ మొత్తంలో స్థలాలను కోల్పోనున్నాయి.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశాంక, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు తదితరులు

రేపటి నుంచి పల్స్‌పోలియో

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్, ఇతర అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పల్స్ పోలియో కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో కలెక్టర్ శశాంక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన ‘ప్రతిసారీ రెండు చుక్కలు.. పోలియోపై నిరంతరం విజయం’ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలు 4,09,308 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరి కోసం 624 పోలియో బూతులను, 55 మొబైల్ టీములను, 55 ట్రాన్సిట్ పాయింట్లను, సమాచార విస్తరణకు 55 వాహనాలను ఏర్పాటు చేశారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలకు సోమ, మంగళ వారాల్లోనూ వేయనున్నారు. ఇందుకోసం 681 వైద్య సిబ్బంది, 11 మంది అధికారులు, 1,600 అంగన్‌వాడీ టీచర్లు, 1,385 ఆశ కార్యకర్తలు, 604 నర్సింగ్ విద్యార్థులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీలో కలెక్టర్ శశాంక



పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కొనసాగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ శశాంక శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా గమనించారు. కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా మౌలిక సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్‌కు సూచించారు. క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీసు సిబ్బంది విధుల్లో ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా మెడిసిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, విధిగా నిబంధనలు అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ అన్నారు.

ఉత్తర తెలంగాణకు ‘రవాణా’ ఊరట



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ – కరీంనగర్ రాజీవ్ రహదారితో పాటు హైదరాబాద్– నాగపూర్ జాతీయ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర రక్షణ శాఖ అనుమతి మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని డిఫెన్స్ భూముల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి లైన్ క్లియర్ అయింది. జనవరి 5న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి డిఫెన్స్ భూముల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతించాలని లేఖను అందించారు. స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శుక్రవారం ఉదయం అనుమతులు జారీ చేసింది. హైదరాబాద్ నగర అభివృద్ధికి అత్యంత కీలకమైన కారిడార్ల నిర్మాణానికి అనుమతించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈమేరకు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ అధికారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

- హైదరాబాద్ నుంచి కరీంనగర్–రామగుండంను కలిపే రాజీవ్ రహదారిలో ప్యారడైజ్ జంక్షన్ నుంచి అవుటర్ రింగు రోడ్డు జంక్షన్ వరకు ఆరులేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, ఎంట్రీ, ఎగ్జిట్ ర్యాంపుల నిర్మాణానికి మొత్తంగా 11.30 కిలోమీటర్ల కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల భూమి అవసరమని రక్షణ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. నాగ్‌పూర్ హైవే (ఎన్‌హెచ్–44)పై కండ్లకోయ సమీపంలోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి అవుటర్ రింగ్ రోడ్డు వరకు ఎలివేటెడ్ కారిడార్ మొత్తంగా 18.30 కిలోమీటర్ల మేర ప్రతిపాదించామని, అందులో 12.68 కిలోమీటర్ల మేర ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి, నాలుగు ప్రాంతాల్లో ఎగ్జిట్, ఎంట్రీలకు, భవిష్యత్తులో డబుల్ డెక్కర్(మెట్రో కోసం) కారిడార్, ఇతర నిర్మాణాలకు మొత్తంగా 56 ఎకరాల రక్షణ శాఖ భూములు బదిలీ చేయాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించి.. కేంద్రం ఇచ్చిన అనుమతులతో ఉత్తర తెలంగాణ దిశగా రవాణా మార్గాల అభివృద్ధికి మార్గం సుగమమైంది. అటు నిజామాబాద్, ఆదిలాబాద్, ఇటు కరీంనగర్ రామగుండం వెళ్లేందుకు సికింద్రాబాద్ ఏరియాలోని అత్యంత ఇబ్బందికరంగా మారిన ట్రాఫిక్ సమస్య తొలగిపోనుంది.

ముఖ్యమంత్రి రేవంత్ హర్షం

కంటోన్మెంట్ పరిధిలో ఎలివేటెడ్ కారిడార్ సమస్యకు పరిష్కారం లభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. కేవలం 80 రోజుల కొత్త ప్రభుత్వం ఈ అనుమతులు సాధించటం ద్వారా తమ చిత్తశుద్ధిని చాటిందని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరినైనా ఎన్నిసార్లైనా కలిసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో సన్నిహిత, స్నేహ సంబంధాలను కొనసాగిస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాజకీయ వైషమ్యాలు, పార్టీల సిద్ధాంతాలేవైనా తెలంగాణ ప్రాంత ప్రయోజనాలే తమకు అత్యంత ప్రాధాన్యమని ముఖ్యమంత్రి మరోసారి స్పష్టం చేశారు. కేంద్ర రక్షణ శాఖ సూచనల మేరకు త్వరలోనే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాలు తలపెడుతామని అన్నారు.

‘స్పెషల్ డ్రైవ్’కు రెడీ

- నేటి నుంచి రంగంలోకి ప్రత్యేక బృందాలు
- గ్రామాల్లో పర్యటించనున్న అధికారులు
- భూ దరఖాస్తుల పరిష్కారానికి సిద్ధం
- ఈ నెల 9వరకు పెండింగ్ అప్లికేషన్లకు మోక్షం

యాచారం: భూ దరఖాస్తుల పరిష్కారానికి ఎట్టకేలకు సర్కార్ ధరణి స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం యాచారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అయ్యప్ప అధ్యక్షతన రెవెన్యూ సిబ్బంది సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం మండలంలోని 24 గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు గుర్తించారు. మండలంలో టీఎం–4, టీఎం–3, టీఎం–22, టీఎం–15, టీఎం–26, టీఎం–14, టీఎం–32, టీఎం–33 తదితర మాడ్యూల్ కింద దాదాపు 2,529 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. అత్యధికంగా మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, చింతుల్ల, చింతపట్ల, మాల్, నక్కర్తమేడిపల్లి, తాడిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్ గ్రామాల్లో భూ సమస్యలున్నట్లు తేలింది. ఆయా గ్రామాల్లో అత్యధికంగా ఏళ్ల క్రితం అసైన్డ్ పట్టాలు పొంది నేటికీ రికార్డుల్లో నమోదు కాకపోవడం.. అర్హులైన రైతులకు పట్టాదారు, పాసుపుస్తకాలు జారీ కాకపోవడం.. కొన్ని గ్రామాల్లో గతంలో నకిలీ పట్టాదారు, పాసుపుస్తకాలు పొందిన వారు రెవెన్యూ సిబ్బంది సహకారంతో ధరణి పోర్టల్‌లో నమోదు చేసుకుని పట్టాదారు, పాసుపుస్తకాలు పొందారు. దీంతో నిజమైన అసైన్డ్‌దారులకు తీవ్ర అన్యాయం జరిగినట్లు గుర్తించారు. అలాంటి నకిలీ సర్టిఫికెట్లను గుర్తించి, నిజమైన రైతులకు న్యాయం చేసేలా అధికారులు కృషి చేయనున్నారు.

తిరస్కరిస్తే సమాచారం..

పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ఈ నెల 9లోపే పూర్తిగా పరిష్కరించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నేపథ్యంలో శనివారం నుంచి గ్రామాల్లోకి రెవెన్యూ స్పెషల్ టీంలు పర్యటిస్తాయి. పెండింగ్ భూ దరఖాస్తులతో పాటు సేత్వార్, ఖస్రా, పాత పహాణీ, పాత 1బీ రిజిస్టర్లు, ధరణి పోర్టల్‌లో ఉన్న భూరికార్డులను గ్రామాలకు తీసుకెళ్లి ప్రజల సమక్షంలో పరిష్కరించేలా కృషి చేస్తారు. తహసీల్దార్ అయ్యప్ప ఆధ్వర్యంలో ఒక టీం, ఉప తహసీల్దార్ కీర్తిసాగర్ ఆధ్వర్యంలో మరో టీఎం ఏర్పాటైంది. ప్రతి టీంలో ఆర్‌ఐ, జూనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు ఉంటారు. స్పెషల్‌డ్రైవ్ టీంలు ఈ నెల 9 వరకు గ్రామాల్లో ఉండి భూ సమస్యలను పరిష్కరిస్తాయి. ఏవైనా కారణాలతో దరఖాస్తులు తిరస్కరిస్తే ఆ ఫిర్యాదుదారుడికి కచ్చితంగా సమాచారం అందించాల్సి ఉంటుంది. దరఖాస్తులో పొందుపర్చిన ఫోన్ నంబర్‌కు ఎస్‌ఎంఎస్ పంపాల్సి ఉంటుంది. భూ సమస్యల ఆధారంగా బాధిత రైతులకు ముందే సమాచారం ఇస్తారు.

నిషేధిత భూములకు మోక్షం కలిగేనా..?

ఫార్మాసిటీ భూసేకరణలో భాగంగా రైతులు పట్టా భూములు ఫార్మాకు ఇవ్వడం లేదని తాడిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి గ్రామాలకు చెందిన రైతుల పట్టా భూముల రికార్డులను సీసీఎల్‌ఏ అధికారులు నిషేధిత జాబితాలో పెట్టారు. ఆయా గ్రామాల్లోని దాదాపు 350 మందికి పైగా రైతులకు చెందిన 4 వేల ఎకరాల పట్టా భూములను నిషేధిత జాబితాలో ఉన్నాయి. ఆయా గ్రామాల రైతులు తమ భూముల పట్టా రికార్డులను నిషేధిత జాబితాలోంచి తీసేయాలని యాచారం తహసీల్దార్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్‌ఏ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేశారు. రైతుల ఆందోళనలను సీరియస్‌గా తీసుకున్న అప్పటి సర్కార్ రైతుల భూముల రికార్డులను ఏకంగా అథారిటీలో పెట్టి భూ పరిహారాన్ని కోర్టులో జమ చేసింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం, స్పెషల్‌డ్రైవ్ చేపట్టిన నేపథ్యంలో నిషేధిత జాబితాలోంచి తొలగిపోయేనా అని ఫార్మా భూ బాధితులు ఎదురుచూస్తున్నారు. మరో 2,500 ఎకరాలకు పైగా భూములు భూదాన్, సీలింగ్ భూములంటూ నిషేధిత జాబితాలో పెట్టారు.



యాచారం తహసీల్దార్ కార్యాలయం

భూ సమస్యలు పరిష్కరిస్తాం



ధరణి స్పెషల్‌డ్రైవ్ ద్వారా మా పరిధిలో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తాం. ప్రత్యేక టీంలు నేటి నుంచి గ్రామాల్లోకి వెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తాయి. రైతులకు ముందే సమాచారం ఇస్తాం. మా పరిధిలో సాధ్యం కానివి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– అయ్యప్ప, తహసీల్దార్, యాచారం

సేంద్రియ సేద్యమే మేలు

రాజేంద్రనగర్ రైతు శిక్షణా కేంద్రం సహాయ సంచాలకులు దివ్యజ్యోతి, రేష్మారాజ్

మొయినాబాద్: రైతులు రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి మళ్లించాలని రాజేంద్రనగర్ రైతు శిక్షణా కేంద్రం సహాయ సంచాలకులు దివ్యజ్యోతి, రేష్మారాజ్ సూచించారు. మొయినాబాద్‌లోని రైతు వేదికలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి రాగమ్మ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటంతో ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు రసాయనాలను తగ్గించాలన్నారు. సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టి జీవన ఎరువులు, జీవ రసాయనాలు, వర్మీ కంపోస్టు ఎరువులను వాడి అధిక దిగుబడులు సాధించాలన్నారు. వీటితో మనుషులు, భూమి ఆరోగ్యంగా ఉండటంతోపాటు ప్రకృతిని కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సునీల్, కుమార్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న సహాయ సంచాలకులు దివ్యజ్యోతి

గ్రీన్ ఫార్మాసిటీ సీఐ బదిలీ

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణా సీఐ నాగరాజు బదిలీ అయ్యారు. ఆయన బదిలీపై జవహర్‌నగర్ పీఎస్‌కు వెళ్లగా, వైటింగ్‌లో ఉన్న పి.రాజేశ్ గ్రీన్ ఫార్మాసిటీ నూతన సీఐగా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సీఐ రాజేశ్‌కు సిబ్బంది అభినందనలు తెలిపింది.

రైతుబంధుకు నిరీక్షణ!

వ్యవసాయానికి పెట్టుబడి సాయంగా అందించే 'రైతుబంధు' నిధులు రాక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. సీజన్ ముగుస్తున్నా డబ్బులు జమ కాకపోవడంతో పంట ఖర్చులకు అప్పులు చేస్తున్నారు. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయాలని 'సాయం' అందని కర్షకులు కోరుతున్నారు.

- సీజన్ ముగుస్తున్నా రైతుల ఖాతాల్లో జమ కాని నగదు
- పెట్టుబడులకు అప్పులు చేస్తున్న అన్నదాతలు

యాచారం: రైతుబంధు నిధుల కోసం అన్నదాతలకు నిరీక్షణ తప్పడం లేదు. గతేడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో చెరువులు, కుంటల్లో నీళ్లు అడుగంటాయి. ఉన్న కొద్ది పాటి నీటి వసతులతో పంటలు పండించుకోవాలని రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతం పెట్టుబడుల కోసం రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో ఏడాదికి ఎకరాకు ఇచ్చే రూ.10 వేల రైతుబంధు నిధులతో వారికి కొంత ఉపశమనం కలిగింది. రైతులు కూడా గత నాలుగైదు ఏళ్లుగా రైతుబంధు నిధులతో సాగు విస్తీర్ణం పెంచుకున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో మొత్తం పట్టాదారు, పాసుపుస్తకాలు కలిగిన రైతులు 19,545 మంది ఉన్నారు. వీరిలో రైతుబంధు లబ్ధి పొందుతున్నవారు 15,718 మంది ఉన్నారు. మండలంలోని నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, మొండిగౌరెల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, చింతపట్ల, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, చింతుల్ల, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో ఎంతో మంది రైతులు రైతుబంధు నిధుల కోసం ఎదురుచూస్తున్నారు.


చౌదర్‌పల్లిలో రైతుబంధు నిధులు రాక అప్పులు చేసి కూరగాయల సాగు చేస్తున్న ఓ రైతు

30 శాతం రైతులకు మాత్రమే..

యాసంగి పంట కాలం ముగిసే దశకు వచ్చింది. ఇప్పటి వరకు మండలంలో రైతుబంధు లబ్ధి పొందింది కేవలం 30 శాతమే. 3 ఎకరాల నుంచి 4 ఎకరాల్లోపు రైతులకు డబ్బులు జమ చేశారు. గతేడాది డిసెంబర్‌లో నిలిచిపోయిన రైతుబంధు నిధులు మళ్లీ ఇటీవల రైతుల ఖాతాల్లో జమ కావడం ప్రారంభమైనట్లు అన్నదాతలు పేర్కొంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్నతాధికారులు, రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు వందలాది ఎకరాల వ్యవసాయ భూములు కొనుగోలు చేశారు. రూ.కోట్లు ఖర్చు చేసి వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన ప్రముఖులు రిజిస్ట్రేషన్లు చేసుకుని పట్టాదారు, పాసుపుస్తకాలు పొందారు. కానీ రైతుబంధుకు మాత్రం దరఖాస్తులు చేసుకోలేదు. మండలంలోని 3,800 ఎకరాలకు పైగా రైతుల భూ వివరాలను ఇవ్వాలని వ్యవసాయాధికారులు ఫోన్లు చేసినా స్పందన లేదు. ధరణి పోర్టల్ సమస్యతో పట్టాదారు, పాసుపుస్తకాలు రాని పేద రైతులు రైతుబంధుకు నోచుకోవడం లేదు.

నిత్యం ఎదురుచూపులు..



నస్దిక్‌సింగారం రెవెన్యూ పరిధిలోని 4.3 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రైతుబంధు పథకం నిధులు ఇంతవరకు రాలేదు. నిత్యం ఫోన్‌లో మెసేజ్ చూస్తున్నా. నిధులు జమైతే పెట్టు బడులకు ఖర్చు చేద్దామని భావిస్తున్నా.

– గొరిగే చంద్రకళ, మహిళా రైతు, నస్దిక్‌సింగారం

రైతుల మేలు కోసం



రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులకు మేలు చేసేందుకే కృషి చేస్తుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల వల్ల రైతుబంధు నిధులు జమ చేయడంలో ఆలస్యం అవుతుంది. గతంలో మాదిరిగా వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులపై రాయితీలు అందించే అవకాశం ఉంది.

– దెంది రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ, యాచారం

అందరికీ జమవుతాయి



రైతుబంధు నిధులు జమ అవుతున్నాయని రైతులు సమాచారం ఇస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో నిలిచిపోయిన నిధులు ఇటీవల మళ్లీ ప్రారంభమైనట్లు సమాచారం ఇస్తున్నాం. ఆలస్యమైనా అందరికీ రైతుబంధు నిధులు ఖాతాల్లో జమ అవుతాయి.

– సందీప్‌కుమార్, ఏఓ, యాచారం

బంగారు భవితకు ఓటే ఆయుధం

ప్రజాస్వామ్య పాలనలో రాజ్యాంగబద్ధంగా నిర్వహించే ఎన్నికలే కీలకం. దేశంలో జరిగే ఎన్నికల ముఖచిత్రాన్ని బాల్యదశ నుంచే అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు నడుం బిగించారు. నేటి బాలలే రేపటి పౌరులని గుర్తించి ఎన్నికల నియమ నిబంధనలను విద్యార్థులకు తెలియజేశారు.

పోల్కంపల్లి పాఠశాలలో మాక్ పోలింగ్


ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థిని


పాఠశాలలో ఓటును వినియోగించుకొని సిరా చుక్క చూపుతున్న చిన్నారులు


ఓటు కోసం బారులు తీరిన బాలలు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల వాతావరణం నెలకొంది. అచ్చం సార్వత్రిక ఎన్నికల మాదిరి ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు నిర్వహించిన మాక్ పోలింగ్ అందరిని అబ్బురపరిచింది. ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల అందుకు వేదికైంది. ఓటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు పాతూరి శ్రీనివాస్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. నామినేషన్ల నుంచి మొదలుకొని బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు, ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల జారీ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిరా, హలీమ్, దత్తాత్రేయ, అశ్వినిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసీఎఫ్ఐ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా యాదయ్య



షాబాద్: సమాజంలో వేళ్లూనుకుపోయిన లంచగొండి తనాన్ని రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని యాంటీ కరెప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా(ఏసీఎఫ్ఐ) సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జాకీర్ షరీఫ్ అన్నారు. మండల పరిధిలోని చందనవెల్లికి చెందిన బేగరి యాదయ్యను సంస్థ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. అనంతరం డాక్టర్ పామెన నర్సింహులుతో కలిసి యాదయ్యకు శుక్రవారం నియామక పత్రం అందజేశారు.

ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా చేస్తాం

ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లా ఖాన్

మహేశ్వరం: ఎర్రకుంట రహదారిని బాగు చేయకుంటే ఎమ్మెల్యే సబితారెడ్డి ఇంటి ఎదుట ధర్నా నిర్వహిస్తామని ఎంబీటీ(మజ్లిస్ బచావో తెహ్రీక్) పార్టీ అధికార ప్రతినిధి అంజదుల్లా ఖాన్ హెచ్చరించారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఎర్రకుంటలో గోతులమయంగా మారిన రహదారిని శుక్రవారం ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన చౌరస్తాలో రహదారి గుంతలమయంగా మారి రెండేళ్లు కావస్తున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే వచ్చి ఓట్లు వేయించుకుంటున్నారన్నారు. ఇప్పటి వరకు ఈ రోడ్డులో ముగ్గురు మృత్యువాత పడ్డారన్నారు. రంజాన్ మాసం సమీపిస్తుందని, ఎర్రకుంటలోని రషీదియా మజీద్ పరిసరాలలో డ్రైనేజీ పొంగి పొర్లుతుందన్నారు. పదేళ్ల పాటు మంత్రిగా ఉన్న సబితారెడ్డి చిన్నపాటి రోడ్డుకు మరమ్మతులు చేయించకపోవడం శోచనీయమన్నారు. అధికారులను స్పందించి రోడ్డు, మురుగు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


ఎర్రకుంటలో పర్యటిస్తున్న అంజదుల్లా ఖాన్

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఐదుగురి అరెస్టు, రూ.34వేల నగదు స్వాధీనం

మొయినాబాద్: పేకాట స్థావరంపై ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి, రూ.34 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎం.మహేందర్‌యాదవ్, కె.నగేష్, బి.మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ శ్యామ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రాజు గ్రామ శివారులోని గండిపేట చెరువు పక్కన పేకాట ఆడుతున్నారు. పక్కా సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదు మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.34,330 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని మొయినాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విధులకు వెళ్తూ.. వైద్యుడి మృతి

షాద్‌నగర్‌రూరల్: విధులకు వెళుతున్న వైద్యుడు కిందపడి అకస్మాత్తుగా మృతి చెందిన సంఘటన శుక్రవారం పట్టణంలోని నాగులపల్లి రోడ్డుపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని వెస్ట్‌మారేడ్‌పల్లిలో నివాసం ఉంటున్న జాన్‌పెజర్(50) షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లిలో క్రిస్టియన్ సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న అమెరికన్ ఆస్పత్రిలో డాక్టర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం విధులకు వెళ్లే క్రమంలో షాద్‌నగర్ బస్టాండ్‌కు వచ్చిన జాన్‌పెజర్ టిఫిన్ చేసేందుకు నాగులపల్లి రోడ్డుకు వచ్చాడు. నడుచుకుంటూ వెళుతున్న ఆయన అకస్మాత్తుగా కిందపడి మృతి చెందారు. ఏఎస్ఐ రాంచందర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలను సేకరించారు. వైద్యుడు జాన్‌పెజర్‌కు గుండెపోటు రావడంతోనే మృతి చెందాడని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య హవేలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చెరువు కబ్జాపై ఫిర్యాదు

శంకర్‌పల్లి: మండలంలోని మిర్జాగూడలో పెద్ద చెరువు కబ్జాకు గురి కావడంతో గురువారం ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మిర్జాగూడ–జనవాడ గ్రామాల మధ్యలో ఉన్న పెద్ద చెరువును కబ్జా చేశారని స్థానికులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు చెరువును పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోకిల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


పెద్ద చెరువులో పోసిన మట్టి